క్లుప్తంగా

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమంలో బుధవారం న్యాయవాది సుమంత్ కుమార్ తన తల్లి చంద్రలీలమ్మ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బాలాజీ, దినేష్ పాల్గొన్నారు.

యువజన విభాగం అధ్యక్షుడిగా వెంకటరామిరెడ్డి

కలసపాడు : వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా మండలంలోని బ్రహ్మణపల్లెకు చెందిన అన్నారెడ్డి వెంకటరామిరెడ్డి(సుమన్) నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని బుధవారం పార్టీజిల్లా అధ్యక్షులు, కడప మేయర్ సురేష్‌బాబు చేతుల మీదుగా జిల్లాపార్టీ కార్యాలయంలో అందుకున్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

రక్తదానం



వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు : రక్తదానం చేయడమంటే ఒక మనిషికి ఆపదలో ఆదుకోవడమేనని వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.నాగరాజు తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రి రక్తసేకరణ సంస్థ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. రక్తదాన శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన 90 మంది విద్యార్థినీ, విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ ప్రొఫెసర్ కేవీ రమణయ్య, జిల్లా ఆస్పత్రి డాక్టర్లు ప్రసన్న, హర్ష, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు , ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అట్లూరు : బాల్యవివాహాలను అరికట్టాలని తహసీల్దారు వెంకటరమణమ్మ, ఎంపీడీఓ సుజాతమ్మలు తెలిపారు. కొండూరు సచివాలయ పరిధిలో అంతర్జాతీయ బాలికాదినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయకుమారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు రత్నాలు, హజీరా, విశ్వంత్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్

చాపాడు : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న స్థానిక ఫ్రెండ్స్ బీఈడీ కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. చాపాడులో కాలేజీ వద్ద బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఫ్రెండ్స్ బీఈడీ కాలేజీ యాజమాన్యం నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్నారని, కాలేజీలో ఎలాంటి తరగతులు నిర్వహించడం లేదన్నారు. పరీక్షల సమయంలో మాస్ కాపీయింగ్ చేయిస్తూ అక్రమ ధనార్జనే ధ్యేయంగా పని చేస్తోందన్నారు.

పంచాయతీలు సుస్థిరాభివృద్ధి సాధించాలి

చాపాడు : మండల వ్యాప్తంగా అన్ని శాఖల సమన్వయంతో గ్రామ పంచాయతీలు సుస్థిరాభివృద్ధి సాధించాలని మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీల అభివృద్ధి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. వాటి అభివృద్ధికి అవసరమైన నిధులు సేకరణ గురించి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఏఓ మ్యాగీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రభుత్వ బీసీ కళాశాలల వసతి గృహ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ బీసీ కళాశాల వసతి గృహాన్ని బుధవారం సందర్శించి వారి సమస్యలు తెలుసుకున్నారు.

బియ్యం పాకెట్ల పంపిణీ

ప్రొద్దుటూరు క్రైం : ఏపీ బేస్‌బాల్ కార్పోరేషన్ చైర్మన్ లక్కిరెడ్డి పవన్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. బర్త్‌డే కేక్ కట్ చేసి పవన్‌కుమార్‌రెడ్డికి తినిపించారు. జిల్లా ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. లక్కిరెడ్డి యువసేన తరపున రక్తదానం చేశారు. మదర్ థెరీసా వృద్ధాశ్రమంలో దోమతెరలు, చీరెలు, పండ్లు అందచేశారు. వృద్ధాశ్రమానికి 20 బియ్యం ప్యాకెట్లను అందచేశారు. పేద బ్రాహ్మణ కుటుంబాలకు 20 బియ్యం ప్యాకెట్లు, నిత్యావసర సరుకులు, రూ. వెయ్యి నగదు పంపిణీ చేశారు. శివాలయంలో ఆయన అభిమానులు 101 టెంకాయలు కొట్టారు.

పేదల ఆరోగ్యానికి భరోసా



బద్వేలు : మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు తెలిపారు. బుధవారం పుట్టాయపల్లె సచివాలయంలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో పాల్గొన్న వారు మాట్లాడుతూ నాడు మహానేత వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి పేదల ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీ పథకం, 108 అంబులెన్స్ సేవలను ప్రవేశపెడితే ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ విధానం, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను అందుబాటులోకి తెచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోడపాటి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మండల అధ్యక్షుడు మల్లేశ్వర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ నరసింహారెడ్డి, సర్పంచ్ జయరామిరెడ్డి, మండల నాయకులు రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు, అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఎస్.రవిబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వై.చంద్రహాసరెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, మండల స్పెషలాఫీసర్ ఖాదర్‌బాషా, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలసపాడులో..

కలసపాడు : పిడుగుపల్లె సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుదర్శన్ పరిశీలించి మాట్లాడారు. శిబిరంలో 407 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశామన్నారు. ఆరుగురిని పెద్దాసుపత్రలకు రిఫర్ చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, సుదా రామకృష్ణారెడ్డి, నారాయణ యాదవ్, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, ప్రత్యేకాధికారి మురళీధర్‌రెడ్డి, ఎంపీడీఓ మహబూబ్ బీ, సర్పంచ్‌లు అంకన గోవిందమ్మ, కొండా రమణమ్మ, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజుపాలెంలో..

మండలంలోని రాజుపాలెం పంచాయతీ పరిధి గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహబూబ్ బీ తెలిపారు.

కాశినాయనలో..

కాశినాయన : మండలంలోని రెడ్డికొట్టాల ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నల్లేరు విశ్వనాథరెడ్డి పరిశీలించి మాట్లాడారు. అనంతరం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంతి, ఎంపీడీఓ మైథిలి, తహసీల్దార్ రామచంద్రుడు, ఈఓపీఆర్డీ ముజఫర్ రహీం, స్థానిక సర్పంచ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : మండలంలోని చల్లగిరిగెలలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ పరిశీలించి మాట్లాడారు. అనంతరం రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లను అందజేశారు. శిబిరంలో వైద్యసిబ్బంది 352 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-1 సీఎం బాషా, వైస్ ఎంపీపీ 2 రాజశేఖర్, ఎంపీడీఓ వరప్రసాదరావు, తహసీల్దారు గంగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సోమిరెడ్డిపల్లె -2 పరిధిలో గురువారం ఉదయం 9గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంగమునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరానికి జిల్లా నుంచి ప్రత్యేక వైద్యులు వస్తున్నట్లు తెలిపారు. సచివాలయం పరిధిలోని ప్రజలు వైద్యసేవలను ఉపయోగించుకోవాలన్నారు.

అట్లూరులో..

అట్లూరు : అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సుధా తెలిపారు. కొండూరు సచివాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడి అనంతరం రోగులకు కొద్దిసేపు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి చైర్మన్ రొండా మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టరు రొండా మల్లికార్జునరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ మణ్యం మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

చాపాడు : ఏపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రక్ష అని మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. మండలంలోని అల్లాడుపల్లెలోని ఎంపీపీ స్కూల్ వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలనే ఉద్దేశ్యంతో.. ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపడుతోందన్నారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ప్రజలందరికీ ముందస్తుగా వైద్య పరీక్షలు నిర్వహించి గ్రామంలో ఏర్పాటు చేసే వైద్య శిబిరం ద్వారా వారికి అవసరమైన చికిత్స ఇవ్వటం జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సూచించారు. అనంతరం రోగులకు మందులను, వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, తహసీల్దారు యామిని, సర్పంచ్ యామిని, వైద్యాధికారులు రాజేష్ కుమార్, ఓబులేసు, కావ్య మాధురి, ఆప్తాలమిక్ ఆఫీసర్ తేజ, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీహెచ్‌ఈఓ రాఘవయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీపేటలో జగన్న ఆరోగ్య సురక్ష..

మండలంలోని లక్ష్మీపేట గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తోందని ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు.

జగనన్న సురక్ష పేదలకు వరం

ప్రొద్దుటూరు క్రైం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని తహశీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు. గోపవరం గ్రామంతో పాటు రాజీవ్‌నగర్, ఇందిరానగర్, ద్వారకానగర్ వాసుల కోసం గోపవరం ప్రాథమిక పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డీపీఎంఓ శశిభూషన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వైద్యులు శ్రీనివాస్, ఇలియరాణి, షేక్ జరీనా, షేక్ హుసేన్‌బాషా, పవన్‌కుమార్‌లు 426 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి మోషె, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



కలసపాడు : రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



కాశినాయన : రెడ్డికొట్టాలలో వైద్యశిబిరంలో రోగులతో మాట్లాడుతున్న విశ్వనాథరెడ్డి



పోరుమామిళ్ల : కిట్లు అందిస్తున్న నాయకులు



చాపాడు : అల్లాడుపల్లెలో మెడికల్ కిట్‌లను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రొద్దుటూరులో ట్రాఫిక్ ఆంక్షలు

ప్రొద్దుటూరు క్రైం : విజయదశమి సందర్భంగా ప్రొద్దుటూరులో ఆంక్షలు విధించినట్లు ట్రాఫిక్ సీఐ యుగంధర్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం పటిష్ట చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 14 నుంచి పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు చెప్పారు.

- జమ్మలమడుగు వైపు నుంచి వచ్చే బస్సులు ప్రొద్దుటూరు పట్టణంలోకి రాకుండా పొట్టిపాడు క్రాస్ రోడ్డు ద్వారా రాకపోకలు సాగించాలి.
- మైదుకూరు వైపు నుంచి వచ్చే బస్సులు పట్టణంలోకి రాకుండా ఆర్టీసీ బస్టాండు దగ్గర నుంచి రాకపోకలు జరపాలి.
- రాజుపాళెం వైపు నుంచి బస్సులు ప్రొద్దుటూరు టౌన్‌లోకి రాకుండా కొర్రపాడు రోడ్డులో ఉన్న కాల్వకట్ట, మల్లేలమ్మ ఆలయం వద్ద నుంచి రాకపోకలు కొనసాగించాలి.
- ఎర్రగుంట్ల వైపు నుంచి వచ్చే బస్సులు పట్టణంలోకి ఎర్రగుంట్ల బైపాస్ జంక్షన్ (వాసవి సర్కిల్) నుంచి సినీహబ్ మీదుగా ఆర్టీసీ బస్టాండు నుంచి రాకపోకలు సాగించాలి.
- అలాగే మైదుకూరు వైపు నుంచి కార్లు, బైకుల్లో వచ్చే వ్యక్తులు జిన్నా రోడ్డు మీదుగా వెళ్లి కొవ్వూరు గ్యారేజీలో వాహనాలను పార్కింగ్ చేయాలి.
- ఎర్రగుంట్ల వైపు నుంచి వచ్చిన వ్యక్తులు తమ వాహనాలను ఆర్యవైశ్య వృద్ధాశ్రమం వెనుక వైపున ఉన్న స్థలంలో పార్కింగ్ చేయాలి.
- రాజుపాళెం, జమ్మలమడుగు వైపు నుంచి ప్రజలు తమ వాహనాలను మార్కెట్ యార్డు, ఎగ్జిబిషన్ పార్కింగ్ స్థలంలో నిలపాలి.
- దసరా పండుగ రోజున ప్రత్యేకమైన ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని సీఐ తెలిపారు. ట్రాఫిక్‌కు సంబంధించి సహాయ, సహకారాల కోసం ట్రాఫిక్ సీఐ యుగంధర్ సెల్ నంబర్ 9121100594, కమాండ్ కంట్రోల్ నంబర్ 9121100702లకు ఫోన్ చేయాలని సీఐ కోరారు.

అయిల్‌ఫామ్ సాగుపై రైతులకు అవగాహన



కొడిగుడ్లపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాశినాయన : మండలంలోని కొడిగుడ్లపాడు రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులకు అయిల్‌ఫామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖధికారి శ్రీనివాసులరెడ్డి, సూయస్ కంపెనీ ప్రతినిధి కొండారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కాశినాయన, మైదుకూరు, బ్రహ్మంగారిమఠం, ప్రొద్దుటూరు, పులివెందుల మండలాలను అయిల్‌ఫాం సాగుకు ఎంపిక చేసిందన్నారు. సూయస్ అగ్రో ఇండ్రస్ట్రీస్ కంపెనీకి జిల్లాలో అయిల్‌ఫాం సాగుకు అనుమతి ఇచ్చిందన్నారు. నీరు ఇంకిపోయే స్వభావం ఉన్న నేలలు నీటి లభ్యత కలిగిన ప్రదేశాలు ఈ పంట సాగుకు అనుకూలమన్నారు. ఎకరాలో సాగుకు 50 నుంచి 60 మొక్కలు అవసరమని, ఒక్కో మొక్క రూ.193 ధర ఉందని, తాము ఉచితంగా వీటిని అందిస్తామన్నారు. ఎకరా అంతరపంట సాగుకు రూ.2100, ఎరువులకు రూ.2100 ప్రభుత్వం ఇస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర సమాచారం, సందేహాల నివృత్తికి పోరుమామిళ్ల ఉద్యానవన శాఖాధికారిని సంప్రదించాలన్నారు. వీఏఏ మధు, రైతులు పాల్గొన్నారు.

విస్తరణ కార్యక్రమాలపై దిశా నిర్దేశం



కేవీకే శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న డాక్టర్ కరుణశ్రీ

మైదుకూరు : కృషి విజ్ఞాన కేంద్రం చేపట్టాల్సిన విస్తరణ కార్యక్రమాలపై డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ శాస్త్రవేత్తలతో దిశ నిర్దేశం చేశారు. బుధవారం ఆమె మైదుకూరు మండలం వనిపెంట కేవీకేను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రం సాంకేతిక అంశాలకు సంబంధించి 2023-24 సంవత్సరానికి ప్రణాళిక అంశాలపై శాస్త్రవేత్తలతో సమీక్షించారు. ప్రకృతి వ్యవసాయం, ఉద్యాన పంటల యాజమాన్య పద్ధతులు, విలువ ఆధారిత పదార్థాల తయారీపై మాట్లాడారు. కేవీకేలో మరిన్ని విస్తరణ కార్యక్రమాలను చేపట్టాలని, పశుపోషణ కార్యక్రామలను నిర్వహించాలని శాస్త్రవేత్తలకు సూచించారు. కేవీకే ఆవరణలో సాగు చేసిన పసుపు, పండ్ల తోటలను పరిశీలించారు. కేంద్రం ఆదాయ వనరులను పెంచుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కేవీకే అధిపతి, శాస్త్రవేత్త శ్రీవిద్యారాణి కేంద్రం నిర్వహిస్తున్న కార్యక్రమాలను విస్తరణ సంచాలకులకు వివరించారు. శాస్త్రవేత్తలు హర్షిత, ఫిరోజ్ హుస్సేన్, కాంతిశ్రీ, లావణ్య తమ తమ విభాగాల నివేదికలను సమర్పించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



ప్రధానోపాధ్యాయుడు కొండారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

చాపాడు : ఇటీవల అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న మండలంలోని అయ్యవారిపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన భాస్కర్ రావును బుధవారం ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గురప్ప మాట్లాడుతూ..భాస్కర్ రావు ఉపాధ్యాయుడి అందించిన సేవలను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయటం తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది సుగుణమ్మ, మహేశ్వర్‌రెడ్డి, రమేష్‌బాబు, అరిగెల భాస్కర్, సుశీలమ్మ, వెంకటరమణ, రమణారెడ్డి, పీఈటీ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని దొరసానిపల్లె జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సి.కొండారెడ్డిని బుధవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల కడపలో ఆకేపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో ఆయన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన సందర్భంగా గ్రామ సర్పంచ్, ఉపాధ్యాయులు శాలువ కప్పి పూలమాలతో సన్మానించారు. గ్రామ సర్పంచ్ అరవ ఈశ్వరమ్మ మాట్లాడుతూ కొండారెడ్డి విద్యార్థుల విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్బీకేను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్



కియోస్క్ మిషన్‌ను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందుతున్న సేవలపై ఆయన ఆరా తీశారు. అన్ని ఎరువులు, విత్తనాల పంపిణీకి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. రైతులకు అన్ని సీజన్లలో అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. కియోస్క్ మిషన్‌ను రైతులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని, రైతులందరూ రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మ్యాగీ, వీఏఏ గోపిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మాంటిస్సోరి హైస్కూల్‌లో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. 31, 32 సచివాలయాల మహిళా పోలీసులు శైలజ, భార్గవిలు బాలికల విద్య ప్రాముఖ్యతను, బాల్య వివాహాల వల్ల కలిగే సమస్యలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆయేషా పాల్గొన్నారు.

- జామియా మసీదువీధిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. మహిళా పోలీసు రమాదేవి, పాల్గొన్నారు. గీతాంజలి హైస్కూల్‌లో బాలికల విద్య ప్రాముఖ్యతను కరస్పాండెంట్ శివరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి విద్యార్థులకు వివరించారు.

బాల్య వివాహాలు నేరం

ప్రొద్దుటూరు : బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని తహసీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు. మండల పరిధిలోని గోపవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార స్టాల్‌ను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నిర్ణీత వయసు వరకు బాలబాలికలకు వివాహం చేయకూడదని, అలా చేస్తే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు.

ఆకట్టుకున్న పోషకాహార స్టాల్

గోపవరం : బ్రాహ్మణపల్లెలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార పదార్థాల ప్రదర్శన ఆకట్టుకుంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు అందించే పోషకాహారం, అలాగే ఏ పోషకాహారం తింటే ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి వివరించారు. మండల ప్రత్యేకాధికారులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవిలు సందర్శించి వారిని అభినందించారు.

కాలం చెల్లిన బస్సులతో చెలగాటం

పోరుమామిళ్ల : పట్టణంలోని వెంగమాంబ విద్యాసంస్థ కాలం చెల్లిన బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నదని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పాత బస్సులు తిప్పడం వల్ల విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. మంగళవారం విపరీతమైన పొగతో వెళుతుండగా ఈదుళ్లపల్లె వద్ద ప్రజలు బస్సును ఆపి ఎస్ఐకి ఫిర్యాదు చేయడంతో ఆయన వచ్చి విద్యార్థులను దింపి వేరే బస్సులో పంపించారు. దీనిపై ఆర్‌డీఓ వెంకటరమణ పోరుమామిళ్ల వచ్చి బస్సును పరిశీలించారు. బస్సుకు సంబంధించిన పత్రాలు పరిశీలించారు. యాజమాన్యం వివరణ కోరగా దారిలో సాంకేతిక లోపం కారణంగానే బస్సు నుంచి పొగ వచ్చిందన్నారు. లోపాన్ని సరి చేసుకోవాలని యాజమాన్యానికి ఆయన సూచించారు. సరైన కండీషన్‌లో బస్సులు నడపాలన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన



విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

బద్వేలు అర్బన్ : రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు తెలిపారు. బుధవారం పుట్టాయపల్లె పంచాయతీ గొడుగునూరు సచివాలయంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను వారు ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో రైతుల కోసం కొన్ని వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని అందులో భాగంగా ప్రతి పంచాయతీలో ఒక రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచారన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఆసుపత్రులను నాడు-నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ కింద 1059 చికిత్సలు మాత్రమే అందుతుండేవని ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ కింద 3254 రకాల చికిత్సలను అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ నాగరాజు, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.రవిబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, మండల స్పెషలాఫీసర్ ఖాదర్‌బాషా, ఏఓ చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18న కృష్ణా జలాల సదస్సును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

మైదుకూరు : సీపీఐ ఆధ్వర్యంలో కడపలో ఈనెల 18న జరిగే రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.నాగసుబ్బారెడ్డి కోరారు. బుధవారం మైదుకూరులో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణ జలాల వివాదంపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకే పరిమితం చేస్తూ బీజేపీ పునఃపంపిణీ కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు. రాష్ట్ర హక్కులను కాపాడుకుందామని పేర్కొన్నారు. కరువు, వలసలు, ఆత్మహత్యలకు నిలయంగా మారిన రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి నికర జలాలు కేటాయించాలి అనే అంశంపై జరుగుతున్న సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు 12 జిల్లాలలోని రైతులు కదిలి రావాలని కోరారు. సదస్సులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు ఓబులేసు, రాష్ట్ర రైతు సంఘాల నాయకులు పాల్గొంటారని వివరించారు. సీపీఐ నాయకులు పి.శ్రీరాములు, బీవీ శ్రీనివాసులు, బి.పీరయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో దేశ వ్యాప్తంగా ప్రజాస్వామిక వాదులపైన అక్రమ కేసులు నమోదు చేసి ప్రజాసంఘాల కార్యకర్తలు, రచయితలను అరెస్టు చేయడం దారుణమన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 62 మంది ప్రజాసంఘాల నాయకుల ఇళ్లపై దాడిచేసి అరెస్టులు చేశారన్నారు. ఇది తగదన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మనోహరరెడ్డికి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యావంతుల ఐక్యవేదిక నాయకుడు ఎస్‌పీ మహమూద్, విరసం నాయకురాలు వరలక్ష్మి, సీపీఐ నాయకుడు రామయ్య, సీపీఎం నాయకుడు సత్యనారాయణ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆప్కాస్‌తో కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏపీ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్స్‌డ్ సర్వీసెస్(ఆప్కాస్)తో కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లభిస్తుందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో బుధవారం నిర్వహించిన ఆప్కాస్ గ్రీవెన్స్ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో ఎంతో మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను కళ్లారా చూసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆప్కాస్‌కు శ్రీకారం చుట్టారన్నారు. ఉద్యోగాల భర్తీలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఔట్ సోర్సింగ్ వ్యవస్థ ద్వారా ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, 1వ తేదీనే జీతాలు, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు అందుతున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హాయాంలో ఉద్యోగాలు ఇవ్వడానికి, జీతాలు ఇవ్వడానికి లంచాలు వసూలు చేసేవారన్నారు. ఇప్పుడు ఆ బాధలు లేకుండా ఉద్యోగాలకు పూర్తి భద్రత లభించిందన్నారు. అనంతరం కాంట్రాక్ట్ ఉద్యోగులకు హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. అలాగే పలువురు యూనియన్ నేతలు తెలిపిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి, ఆప్కాస్ డైరెక్టర్లు భాస్కర్‌రెడ్డి, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, ఆర్.వి.సాయిక్రిష్ణ, కౌన్సిలర్ రామ్మోహన్, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి వార్డు ఇన్‌చార్జిలు, తదితరులు పాల్గొన్నారు.